క్లుప్తంగా

ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండాలి

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన కొత్త రేషన్ కార్డుల ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతోందని, ఎంటీఎంసీ పరిధిలో ఉన్న 65 సచివాలయాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి దరఖాస్తు చేసుకునే వారికి సహకరించాలని పేర్కొన్నారు.

రేపు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభం

కాజ (మంగళగిరి): మండలంలో కాజ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 19వ తేదీన మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించనున్నట్లు కమిషనర్ అలీంబాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరి పట్టణంలోని రాజీవ్ గృహకల్ప రోడ్డులోని వీవర్స్ కమ్యూనిటీ హాలు, ఇందిరానగర్‌లోని కృష్ణ బలిజ కమ్యూనిటీ హాల్‌లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ వీటిని ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం, సాయంత్రం 50 మంది చొప్పున బ్యాచ్‌లుగా మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



తాడేపల్లి రూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని తాడేపల్లి ఎస్‌ఐ ప్రతాప్‌కుమార్ అన్నారు. శనివారం తాడేపల్లి మహానాడు సమీపంలోని కృష్ణానదికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే మద్యం తాగుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

దీక్ష విరమణ

మంగళగిరి టౌన్: డిపో యాజమాన్యం వైఖరిపై విసుగు చెంది, ఉద్యోగుల సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ మూడు రోజులుగా ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శనివారం విరమించినట్లు యూనియన్ జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. అక్రమ సస్పెన్షన్‌లను రద్దు చేయాలని మంగళగిరి బస్టాండ్ ఎదుట నిరాహార దీక్షలు చేపట్టామని, డిపో యాజమాన్యంతో చర్చలు సఫలం కావడంతో దీక్షలు విరమించినట్లు పేర్కొన్నారు. దీక్షలో కూర్చున్న వారికి నిమ్మరసం ఇచ్చారు. జిల్లా నాయకులు కరిముల్లా, నాగేంద్రమ్మ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, యూనియన్ గౌరవ అధ్యక్షుడు చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రక్తపోటుపై అవగాహన ర్యాలీ



దుగ్గిరాల: ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా ప్రజలను చైతన్య పరిచేందుకు అవగాహన ర్యాలీ జరిగింది. దుగ్గిరాల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టరు ఇజాజ్ అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రక్తపోటు ఉన్న వారు మందులు సక్రమంగా తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక అధికారి బి.వెంకటసాయి కుమార్, సర్పంచ్ ఖుషీబాయి, ఈవో కె.వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

ఎండ నుంచి ఉపశమనం కలిగేలా చర్యలు



మంగళగిరి టౌన్: బీట్ ద హీట్ కార్యక్రమం ద్వారా ఎండ నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలను చేపట్టినట్లు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ శకుంతల వెల్లడించారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మంగళగిరి పాత బస్టాండ్ వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. శకుంతల మాట్లాడుతూ అందరూ మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో జంతువులకు నీటి తొట్టెలను, పక్షుల కోసం ఉట్టిలో నీరు నింపి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజల అవసరాల మేరకు ఎంటీఎంసీ ఆధ్వర్యంలో ప్రధాన రహదారులు, బస్టాండ్‌ల వద్ద, వివిధ ప్రాంతాల్లో 55 చలివేంద్రాలు, ఐదు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మంగళగిరిని చెత్తరహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎంటీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేలల్లో దహనం చేయొద్దు

దుగ్గిరాల: మండలంలో మొక్కజొన్న, జొన్న చేలల్లో పంట వ్యర్థాలకు మంట పెట్టడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎంఏవో పి.శిరీష శనివారం ప్రకటనలో తెలిపారు. వాయు కాలుష్యం పెరుగుతోందని పేర్కొన్నారు.

పథకం భేష్.. ప్రచారం తుస్..!



ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలపై పేదలకు అవగాహన కల్పించడంలో విద్యాశాఖ అలసత్వం ప్రదర్శిస్తోంది. ఐదు సంవత్సరాలు నిండిన విద్యార్థులకు ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాలను విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో కల్పించాలి. విద్యాశాఖ నిర్లక్ష్యం, ప్రైవేటు యాజమాన్యాల నిర్లిప్తత కారణంగా క్షేత్రస్థాయిలో ఉచిత ప్రవేశాల కల్పన జరగడం లేదు. పేదలకు అవగాహన కల్పించడంపైనా శ్రద్ధ చూపడం లేదు. దీంతో సమాచారం లేక వారు పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాలకు స్పందన అంతంతే

- ఎంఈవో కార్యాలయాలలో ఏర్పాటు కాని హెల్ప్‌డెస్క్‌లు
- సచివాలయాలలో కనిపించని అవగాహన పోస్టర్లు
- పేదలకు మేలు చేసే పథకంపై విద్యాశాఖ అలసత్వం



మంగళగిరి : ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు నియోజకవర్గంలో స్పందన అంతంత మాత్రంగానే ఉంది. పేద కుటుంబాలకు చెందిన బాలబాలికలు, దివ్యాంగులు, అనాథలు, హెచ్ఐవీ బాధిత చిన్నారులకు ఐదు శాతం, షెడ్యూల్ తెగలకు నాలుగు శాతం, షెడ్యూల్ కులాలకు పది శాతం, బీసీ, మైనార్టీ, ఓసీలలో పేదలకు ఆరు శాతం సీట్లు కేటాయిస్తారు. పేదలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాలలో కుటుంబ వార్షిక ఆదాయం రూ 1.20 లక్షలలోపు, పట్టణ ప్రాంతాలలో రూ.1.40 లక్షలలోపు ఉండాలి. ఉచిత ప్రవేశాలకు ఏప్రిల్ నెల 28వ తేదీన ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 19వ తేదీతో ముగియనుంది. ఆన్‌లైన్, మీ సేవ, సచివాలయం, విద్యా శాఖ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకోవచ్చు. మే నెల 16 నుంచి 20వ తేదీ వరకు విద్యార్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. మే నెల 21 నుంచి 24వ తేదీ వరకు లాటరీ విధానంలో మొదటి దశ విద్యార్థులను ఎంపిక చేస్తారు. వారి ప్రవేశాలను జూన్ 2వ తేదీన నిర్ధారిస్తారు. రెండో దశ ఎంపిక జాబితాను జూన్ 6వ తేదీన విడుదల చేస్తారు. ప్రవేశాలను అదే నెల 12వ తేదీన నిర్ధారిస్తారు.

క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయింపుపై గ్రామ, మండల, పట్టణ స్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. పత్రికలలో ప్రకటనలతోపాటు విద్యాశాఖ కార్యాలయాల వద్ద, సచివాలయాల వద్ద ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు, బ్రోచర్లు తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. స్థానిక విద్యాశాఖ అధికారులు ఎక్కడా ఈ తరహా ప్రచారం నిర్వహించిన దాఖలాలు కనిపించడం లేదు. ప్రధానంగా ఈ ప్రక్రియ పూర్తయ్యేవరకు నిరంతరం ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. మండల స్థాయిలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలి. సోషల్ మీడియాలో సైతం విస్తృత ప్రచారం నిర్వహించి ఎక్కువ మంది పేదలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినా అమలుకు నోచుకోవడం లేదు. విద్యాశాఖ అలసత్వంతో పేదలకు అవగాహన లేక దరఖాస్తులు చేసుకోలేక నష్టపోతున్నారు. నియోజకవర్గంలో 87 ప్రైవేటు పాఠశాలలున్నాయి. మంగళగిరి అర్బన్, మండలంలో 43, తాడేపల్లి అర్బన్, రూరల్‌లలో 30, దుగ్గిరాల మండలంలో 14 బడులు ఉన్నాయి. తాడేపల్లిలో ఇప్పటికే 46 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు.

అవగాహన పెంచుతాం

ఎంఈవో బాబు మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీతో ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు ముగుస్తుందన్నారు. ఉచిత ప్రవేశాలపై గ్రామ, మండల స్థాయిలో అవగాహన కల్పించాలని పేరెంట్స్ కమిటీలకు, ఉపాధ్యాయులకు సూచించామని చెప్పారు. ప్రతి సచివాలయ పరిధిలోనూ తగిన ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

– బాబు, ఎంఈవో

కార్మికుల పోరాటానికి మద్దతు



మద్దతు తెలియజేస్తున్న జ్ఞానమ్మ తదితరులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు విజయవాడ హ్యూమన్ రైట్స్ సొసైటీ చైర్మన్ యు.జ్ఞానమ్మ శనివారం మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌లు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు ఇన్ని రోజులుగా దీక్షలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. కార్మికులకు ఎన్నికల సందర్భంగా నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె. అగ్గయ్య, వై.సాంబయ్య, సుబ్బారావు, రమణమ్మ, నరసింహారావు, అంకయ్య, ఆశీర్వాదం, గురవయ్య, రమాదేవి, సూర్యప్రకాశరావు, ఇమాంబీ, ఇస్మాయిల్, దుర్గాభవాని, శారద, భవాని తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు, నమ్మకానికి ప్రతీక భారతి సిమెంట్



కార్మికులకు బీమా బాండ్లు అందిస్తున్న సురేష్

తాడేపల్లి రూరల్: నిర్మాణ రంగంలో నాణ్యతకు, నమ్మకానికి భారతి సిమెంట్ ప్రతీక అని మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ పూల సురేష్ అన్నారు. తాడేపల్లి నగర పరిధిలోని ఉండవల్లిలో శివదుర్గ ఏజెన్సీ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తయారీలోనూ, సరఫరాలోనూ కచ్చితమైన నాణ్యతాప్రమాణాలు పాటించడంతో అతి తక్కువ కాలంలోనే భారతి సిమెంట్ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. వ్యాపార దృక్పథంతో కాకుండా నిర్మాణ రంగంలోని కార్మికుల సంక్షేమానికి భారతి సిమెంట్ యాజమాన్యం కృషి చేస్తోందని పేర్కొన్నారు. నిర్మాణ రంగంలో వస్తున్న మార్పులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిర్మాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తాపీ మేస్త్రీలకు, కార్మికులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా కూడా కల్పిస్తూ సామాజిక బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తోందని చెప్పారు. నిర్మాణ రంగంలో కార్మికులు పాటించాల్సిన విధానాలు, ఇంకుడు గుంతల ఆవశ్యకత, నీటి వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం మేస్త్రీలకు, కార్మికులకు ఉచిత బీమా సదుపాయం కల్పించి, బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ సీనియర్ టెక్నిక్ ఆఫీసర్ భవానీ శంకర్, శివదుర్గ ఏజెన్సీ ప్రొప్రయిటర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రతపై ప్రజలకు అవగాహన



కార్యక్రమంలో యూపీహెచ్‌సీ, ఎయిమ్స్ వైద్య సిబ్బంది

మంగళగిరి టౌన్: వేసవి కాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో శనివారం సిబ్బంది, ఎయిమ్స్ వైద్య విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర నోడల్ ఎన్‌యూహెచ్ఎం అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలోని అన్ని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ప్రతి నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా బీట్ ద హీట్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలియజేశారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్య అధికారిణి డాక్టర్ అనూష, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీమన్నారాయణ, ఎయిమ్స్ నర్సింగ్ ట్యూటర్ కాశేశ్వరి, ఈఎఫ్ఎం హెచ్‌వోడీ డాక్టర్ సత్యనారాయణ, వైద్యులు జగదీష్, విజయ్, కిషోర్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

తాడేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వ కార్మిక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20వ తేదీన జరుగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేబీ భవన్‌లో రైతు, కార్మిక సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జొన్న శివశంకరరావు మాట్లాడుతూ.. రైతుల నడ్డి విరిచేందుకు, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చిందని విమర్శించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, సీఐటీయూ తాడేపల్లి మండల నాయకుల పల్లె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

తాడికొండ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను తుళ్లూరు పోలీసులు సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా బోరుపాలెం రీచ్ నుంచి ట్రాక్టర్లలో ఇసుకను లోడింగ్ చేసి తరలిస్తుండగా రెండు రోజుల క్రితం పోలీసులు వాటిని స్టేషన్‌కు తరలించి, సీజ్ చేశారు. ఎలాంటి కేసు నమోదు చేయకుండా స్టేషన్ ఎదుట నిలిపి ఉంచడంపై పలువురు చర్చించుకుంటున్నారు.

ముస్లిం సమాజానికి జకియా ఖానం ద్రోహం



దుగ్గిరాల: ఎమ్మెల్సీ, శాసనమండలి డెప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం బీజేపీలో చేరడం ద్వారా ముస్లిం సమాజానికి ద్రోహం చేశారని వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ సీనియర్ నాయకుడు షేక్ సుభాని అన్నారు. శనివారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జకియా ఖానం భర్త చనిపోయినప్పుడు పుట్టెడు దుఃఖంలో ఉంటే వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలిచి, ఆమెను ఉన్నత పదవిలో కూర్చోబెట్టారని గుర్తుచేశారు. ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా నల్ల చట్టాలు తెచ్చిన బీజేపీలో స్వార్థ ప్రయోజనాల కోసం ఆమె చేరడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. యావత్తు ముస్లిం సమాజానికి తీరని ద్రోహం చేశారని విమర్శించారు. ముస్లింలు ఆమెను ఎప్పటికీ క్షమించరన్నారు. కార్యక్రమంలో రషీద్, సుభాని, మస్తాన్ వలి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యం



దుగ్గిరాల: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేక అధికారి బి.సాయి కుమార్ కోరారు. ఈ నెల వేడిని జయించండి అనే నినాదంతో కార్యక్రమం జరిగిందన్నారు. దుగ్గిరాల గ్రామంలో శనివారం ఉదయం 8.30 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించారు. దుగ్గిరాల ఇరిగేషన్ కార్యాలయం నుంచి రైలు పేట వంతెన వరకు కాల్వకట్ట వద్ద చెత్త తొలగించారు. మండల ప్రత్యేక అధికారి బి.వెంకటసాయి కుమార్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలన్నారు. ఈ మేరకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాణావత్ ఖుషీబాయి, డెప్యూటీ ఎంపీడీవో. కె.జె.నెహ్రూ, ఈవో కె.వివేకానంద, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కేకేఆర్ డిగ్రీ కళాశాలలో...

స్థానిక డాక్టర్ కేకేఆర్ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కళాశాల ప్రాగణం శుభ్రం చేసి, మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ కె.గిరిధర రావు, ఎన్ఎస్ఎస్ పీవో బి.రాంబాబు, కె.సరళాదేవి, ఎన్.వాసుదేవ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలలో తనిఖీలు



తాడికొండ: మండల కేంద్రంలో శనివారం జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్రముని ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాలలో లబ్ధిదారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. స్టాకును పరిశీలించారు. తమకు గోదాము నుంచి అందే సరకు కచ్చితమైన తూకం రావడం లేదని, ఇటీవల పత్రికలలో కథనాలు వచ్చినా అధికారుల్లో మార్పు రాలేదని డీలర్లు ఫిర్యాదు చేశారు. పౌర సరఫరాల శాఖ గోదామును తనిఖీ చేసేందుకు చంద్రముని వెళ్లగా.. అక్కడ ఎవరూ లేకపోవడం గమనార్హం. వేరే పనిపై బయటకు వెళ్లామని చెప్పడంతో డీఎస్‌వో వెనుదిరిగారు. స్టాకు సరిపడా లేనందునే తాళాలు వేసి వెళ్లిపోయారంటూ పలువురు డీలర్లు ఆరోపిస్తున్నారు. రాబోయే నెలలో అయినా తమకు సరకు సక్రమంగా పంపిణీ చేయించాలని కోరారు. తనిఖీలలో ఆయన వెంట సీఎస్ డీటీ దేవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



వేమారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

మంగళగిరి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి అందరూ కృషి చేస్తూ రానున్న ఎన్నికలలో విజయమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) కోరారు. నియోజకవర్గంలో పార్టీ పదవులు పొందిన పలువురు నాయకులు శనివారం ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న పార్టీ కార్యాలయంలో వేమారెడ్డిని కలిశారు. తమకు పదవులు వచ్చేలా కృషి చేసినందుకు పుష్పగుచ్ఛాలు అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ... కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం సీఎం చంద్రబాబు ఒక్క హామీ కూడా అమలు చేయలేదని పేర్కొన్నారు. అతి తక్కువ కాలంలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలలో ప్రభుత్వంపై వ్యతిరేకత కనిపిస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు ప్రజలలోకి తీసుకెళ్లాలని తెలిపారు. పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు. పదవులు రాని వారు నిరుత్సాహపడాల్సిన పనిలేదని సూచించారు. వారి సేవలను పార్టీ తప్పకుండా వినియోగించుకుంటుందన్నారు. పదవి వచ్చిన వారు దానిని అలంకారప్రాయమని అనుకోవద్దని సూచించారు. పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాలి వెంకట కృష్ణ, మహిళా నాయకులు సంకె సునీత, దర్శి విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



వేమారెడ్డితో నిడమర్రు పార్టీ నాయకులు

కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ప్రాధాన్యం



వనమా బాల వజ్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

- వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త డైమండ్ బాబు
- మేడికొండూరు మండల కమిటీ, గ్రామ పార్టీ అధ్యక్షులకు దిశా నిర్దేశం

తాడికొండ: పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యం ఉంటుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) అన్నారు. మేడికొండూరు మండలంలో పార్టీ అధ్యక్షుడు, మండల కమిటీ, గ్రామ పార్టీ అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన నాయకులు శనివారం డైమండ్ బాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రమించే వారిని కీలక పదవులకు ఎంపిక చేశామన్నారు. అందరూ కలిసికట్టుగా వచ్చే ఎన్నికల్లో భారీ విజయాన్ని అందించేలా పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించడంతో ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి పేద ఇంటికి ఏటా రూ.లక్ష వరకు లబ్ధిం అందిందని.. ఇప్పుడు ఏడాదికి రూ.లక్ష అప్పులపాలయ్యే పరిస్థితి వచ్చిందని తెలిపారు. మేడికొండూరు, తాడికొండ మండల పార్టీ అధ్యక్షులు తాళ్ళూరి వంశీకృష్ణ, ముప్పాళ్ళ మనోహర్, సొసైటీ మాజీ చైర్మన్ చుండు వెంకటరెడ్డి, మేడికొండూరు మండల ముఖ్య నాయకులు షేక్ సుభాని, మర్రి సుబ్బారావు, కొరివి చెన్నయ్య, పేరం సాయి, షేక్ హోటల్ సుభాని, కంకణాల పరమేశ్వరరావు, భవనం రాజశేఖరరెడ్డి, షేక్ మొహిద్దీన్, దొప్పలపూడి దయాకర్, ఆళ్ళ ఉమా మహేశ్వరరెడ్డి, కె. నరసింహారావు, నాయకులు పాల్గొన్నారు.

మహిళలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సాంబశివరావు

మంగళగిరి: బ్యాంకుల ద్వారా ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించాలని ఆర్డిడ్స్ (సమీకృత గ్రామీణ గిరిజనాభివృద్ధి సేవా సంస్థ) సెక్రటరీ యర్రు సాంబశివరావు తెలిపారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆర్డిడ్స్, రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళలకు డిపాజిటర్స్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ.. మహిళలు బ్యాంకింగ్ వ్యవహారాలపై పూర్తి అవగాహన కల్పించుకోవాలన్నారు. రైతులు సబ్సిడీ రుణాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బ్యాంక్‌లో ఖాతా ఉన్న వారు జీవనజ్యోతి, అటల్ పెన్షన్ యోజన, సురక్ష బీమా పథకాలను వినియోగించుకోవాలని కోరారు. రిజర్వ్ బ్యాంక్ రీసోర్స్‌పర్సన్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, రుణాలు, సబ్సిడీ పథకాలు, బ్యాంక్ అక్కౌంట్ సంబంధించిన వివరాలను మహిళలు తెలుసుకోవాలన్నారు. ఆర్‌బీఐ కౌన్సిలర్ ఆర్.శంకరరావు మాట్లాడుతూ బీమా పథకాలు, సేవింగ్స్ ఖాతాల నిర్వహణ గురించి వివరించారు. కార్యక్రమంలో మెప్మా ప్రతినిధులు మాలతి, సుధాకర్, జ్యోతి, ఆర్డిడ్స్ ప్రతినిధి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పదవి నుంచి ఆర్ఎంపీల సంఘం అధ్యక్షుడి తొలగింపు

నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సభ్యుల ప్రకటన

మంగళగిరి/ మంగళగిరి టౌన్: ఆర్ఎంపీ వైద్యుల సంఘంలో రూ.5.50 లక్షల మేరకు గోల్‌మాల్ జరిగినట్లు తెలిసింది. శనివారం పట్టణంలోని ఓ హోటల్‌లో ఆర్ఎంపీ వైద్యులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో నగదు గోల్‌మాల్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధ్యక్షుడు కోళ్ళపూడి హేమసుందర్‌ని సభ్యులు ప్రశ్నించారు. సమాధానం చెప్పబోనని కార్యవర్గ సభ్యులపై ఆయన ఎదురుదాడి చేసినట్లు సభ్యులు తెలిపారు. దీంతో హేమసుందర్‌ను కార్యవర్గం నుంచి తొలగించి, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామన్నారు. అసోసియేషన్ కార్యాలయం తాళాలు హేమసుందర్ ఇవ్వకపోవడంతో తాళాలు, డాక్యుమెంట్‌లు తమకు ఇప్పించాలని నూతన కార్యవర్గం ప్రతినిధులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అధ్యక్షుడిగా కొల్లి నాగేశ్వరరావు, కార్యదర్శిగా ఆర్.సత్యనారాయణ, కోశాధికారిగా సీహెచ్ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కరిముల్లా, ఈసీ సభ్యులను ఎన్నుకున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మంగళగిరి: మండలంలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఈ నెల 12వ తేదీన గుర్తు తెలియని వ్యక్తిని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతడిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.